# బేడా కాసులు ఆదా

[గల్పిక]

"నాన్నా, కృష్ణలీలలు సినిమా చూడవద్దూ?"

"ఉండరా, ఒక టేగోలా!...అయితే, భారసాలకు అందర్నీ పిలవాలిసిన దేటే? వాళ్ళకు బట్టలూ అవీకూడా పెట్టొద్దూ?"

"బాగుందే, వాళ్లంతా పిల్లలకు ఏవైనా చదివిస్తే అవన్నీ తీసుకుని ఊరుకుంటే ఏం బాగుంటుందీ?"

"ఆఁ! చదివింపులు! గళ్లరుమాలాలూ, సిల్కుచేతి గుడ్డలూ చదివించినవాళ్లందరికీ బట్టలు పెడుతూ కూర్చుంటే-చేతులో తడిలేదు."

"అయితే మానెయ్యండి, నాకేం?"

"అవ్వను నీకేం? మాటపడేది నేనేగా!"

"అందుకనే నలుగుర్నీ పిలవండీ, అన్నాను."

"మంచిపనిచేశావు!"

* * *

"మంచిసినిమా, నాన్నా! అంతా వెళుతున్నారు, నాన్నా!"

"ఉండరా, ఒక టేగోలా!...మాట్లాడవేమే? చౌకలో పోతుంది, ఏటవతల సంబంధం చూస్తాముటే?"

"ఇంకో ఐదువందలకు లోపిస్తారుటండీ? ఊళ్లోవాడూ, చదువుకున్నవాడూ ఉండగా, ఇంకొంచెం ఆస్తిఉందిగదా అని పిల్లదాన్ని ఏటవతల ఇచ్చుకుంటే మీరాదాచేసే అయిదువందలూ తిరగటానికి సరిపోదూ?"

"ఏం తిరగటమో! చేతులో తడిలేదు."

"అయితే మానెయ్యండి. నాకేం?

"అవును నీకేం? మాటపడేది నేనేగా!"

"అందుకనే ఊళ్లోసంబంధం చెయ్యండీ అన్నాను."

"మంచిపని చేశావు!"

* * *

"ఇవాళ సినిమా ఆఖర్రోజు, నాన్నా! పులులూ, సింహాలూ—మంచిసినిమా, నాన్నా!"

"ఉండరా, ఒకటేగోలా!... చెప్పవేమే? ఇల్లమ్ముదామా, పొలమమ్ముదామా? రెంటికీ ఒకటే ధర వచ్చేట్టుంది. కాకపోతే, ఇంతకన్న మనకు పొలంమీదే ఎక్కువగిట్టుబాటవుతున్నది."

"అందుకని ఇల్లులేకుండా చేసుకుంటారటండీ? మన నట్టింట మనం తినకమాడినా ఎవరికీ తెలీదు. ఇల్లూ వాకిలీ లేక చెట్టూ పుట్టా పట్టిపోతే మనకు పొలం ఉందని మన్నించేదెవరండీ?"

"ఎవరో అనుకుంటారని నష్టపడతామటే? కొంపకేం? అయిదురూపాయలు పారేస్తే ఏ వసారా అయినా దొరక్కపోదు. గంగగోవంటి భూమి—"

"అయితే మీయిష్టమొచ్చినట్టు చెయ్యండి, నాకేం?"

"అవును నీకేం? మాటపడేది నేనేగా?"

"అందుకనే పొలం అమ్మండీ అన్నాను."

"మంచిపని చేశావు!"

* * *

"సినిమాకుపోవద్దు, నాన్నా?"

"బంగారమంటి పొలం కాస్తాపోయింది. ఇంకా సినిమా ఏమిట్రా, వెధవా? జరిగిందంతా సినీమా కాదూ?"